# ఒక తుది ఒక మొదలు

ధనవర్దుడికి మెలుకువొచ్చింది. కళ్లు తెరిచేసరికి చుట్టూ ఎర్రగా ఎండకాస్తున్నది. కళ్లల్లోకి సూర్యకిరణాలు పడుతుండటం వల్ల తేరిపార చూడలేకపోయాడు. మొహం పక్కకి తిప్పుకుని లేచికూచున్నాడు. ఏమిటి? తను కటిక నేల మీద పడుకున్నాడా? అరె - అసలు ఇల్లే లేదు. తన ఇల్లేకాదు. ఏ ఇళ్లూ లేవు. రోజూ కళ్లు తెరిచేసరికి ఇంటిముందున్న వేపచెట్టు మీద పక్షులు కిలకిలలాడేవి. చల్లని గాలికి చెట్లు తలలూపేవి. ఇప్పుడా దృశ్యమే లేదు. చుట్టూ ఒక్క చెట్టు కాదు గదా నేలమీద ఒక్క గడ్డిపరకకూడా కనపటం లేదు. వేచి నుంచున్నాడు.

కనుచూపు మేర ఇళ్లుగాని చెట్లుగాని లేవు. ఈ భూమి ఇంత బోడిగా ఎన్నడూ లేదు. ఇది కలా? నిజమా? గిల్లి చూసుకుందామనుకున్నాడు గాని అవసరం లేదు. తను పూర్తిగా మెలుకువగా ఉన్నాడు. తన బుద్ధి పని చేస్తున్నది.

తన ఇల్లు - ఇల్లు కాదు పెద్ద భవనం, భార్యాబిడ్డలు, సేవకులు ఏమయ్యారు? ఎలా జరిగిందిదంతా? నాలుగడుగులు వేశాడు. ఇంకో నాలుగు - పది - ఇరవై - వందగజాలు దాటివచ్చాడు. ఎంత పరిశీలనగా చూసినా నేలమీద ఒక్క గడ్డిపరక కనపడలేదు. ఇంకా నడిచాడు. నడిచాడు. నడిచాడు. ఒక్క పిట్టకూడా కనపడలేదు. ఏదన్నా ప్రళయం వచ్చిందా? తాను ప్రళయం గురించి చదివిన సంగతులన్నీ గుర్తొచ్చాయి. ఈ భూమి, సూర్యుడు... అన్నీ బాగానే ఉన్నాయి. భూమి బద్దలుకాలేదు. తను బతికే ఉన్నాడు. తనవంటి మీద బట్టలు... అరె ఇలా ఉన్నాయేమిటి? ఇంతసేపూ గమనించనేలేదు. ఇవా తనబట్టలు? పట్టు రవసెల్లాలు - సన్నని దుకూలాలు - మెత్తని నూలు వస్త్రాలు ఇవేవీ లేవు! ఇవి గోనెలా, చెట్టు బెరడులా?

ధనవర్దుడికి ఏమీ పాలుపోవడం లేదు. పిచ్చిపిచ్చిగా వుంది. రోజూ ఈ పాటికి ముఖం కడుక్కునేవాడు. వేడిపాలు తాగేవాడు. ఇవ్వాళ తను ముఖం కడుక్కోలేదు. ఎలా కడుక్కుంటాడు, పోనీ మామూలుగా పుక్కిలిద్దామన్నా నీళ్లు లేవు. నడుస్తున్నాడు. ఎంత సేపయిందో. సూర్యుడు ఆకాశంలోకి ఎగబాకుతున్నాడు. పైపైకి. ఏమిటో, ఈ నేల చాలా విచిత్రంగా వుంది. ఇలాగేనా నేలవుండేది? ఏం జరిగిరిది? ఒక గమ్యం లేకుండా నడుస్తున్నాడు. ఏమీ అర్థం కావటం లేదు.

ధనవర్దుడికి పెద్ద పొలం వుంది. చాలా సారవంతమైన నల్లరేగడినేల, రైతులు, పాలేర్లు ఆ పొలందున్నేవారు. రాజనాల్లాంటి బియ్యం పండేవి. పొలాల గట్లమీద ఫలవృక్షాలుండేవి. ఒకరకం కాదు. మామిడి, సీతాఫలం, సపోటా, జామి, దానిమ్మ, బొప్పాయి, అరటి... ఒక రకం కాదు. కొబ్బరిచెట్లు

వరసలు తీరి వుండేవి. దక్షిణాన తాటితోపు. బలిష్ఠమైన ఎడ్లు, నేల చక్కగా దున్నేవి. తూర్పున కొద్ది దూరంలో సెలయేరు. నీళ్లు తియ్యగా చాలారుచిగా వుండేవి. పొలంలో ఒక మూల పెద్దనుయ్యి. పంటకాలవల్లోకి ఎప్పుడైనా నీరు రాక పోతే ఆ నూతిలో నీరు గిలకతో తోడేవారు పాలేర్లు. ఆ దృశ్యం అంతా కళ్లల్లో మెదిలింది.

ధనవర్షుడికి హిరణ్యాకుడని ఒక స్నేహితుడుండేవాడు. అతను ఎన్నెన్నోరకాల వర్తకం చేసేవాడు. అడవిలో చెట్లు కొట్టించి కలప అమ్మేవాడు. కొండదగ్గిర రాళ్లు పగలగొట్టించి ఇళ్లు కట్టుకునేందుకు మేలయిన రాయి అమ్మేవాడు. ఏటిలో ఇసక అమ్మేవాడు.

ఒక సంవత్సరం ధనవర్షుడి పొలంలో మిడతలు పడ్డాయి. వరసగా నాలుగురోజులు. మూడోరోజునాటికి క్రిమిసంహారక రసాయనాలు తెప్పించి చల్లించాడు. నాలుగోరోజున లక్షలకొద్దీ మిడతలు చచ్చిపడ్డాయి. పంట చాలా భాగం నాశనమయింది. దాంతో కోపం, బాధా ఎక్కువయి - పొలంలోకి ఉడతల్నీ, తొండల్నీ, బల్లుల్నీ, పిట్టల్నీ, పాముల్నీ, ఎలకల్నీ, కప్పల్నీ అన్నింటినీ చంపించాడు. ఆఖరికి గొల్లభామల్నీ, సీతాకోకచిలకల్నీ కూడా చంపించాడు. చాలా పెద్ద ఎత్తున క్రిమిసంహారక మందుల్నీ చల్లించాడు. పళ్ల చెట్లకక్కూడా తెగులు పట్టకుండా మందులు చల్లించాడు.

హిరణ్యాకుడు అడవుల్లో బాగా పెరిగిన చెట్లని నరికించేవాడు. ఆ చెట్లని ఆశ్రయించిన పక్షులు ఎక్కడెక్కడికో వలసపోయాయి. ఉడతలు తొండలు, కోతులు, పాములు పోయినవి పోయాయి. చచ్చినవి చచ్చాయి. హిరణ్యాకుడిలాగే మరికొందరూ చేశారు. దాళ్లకోసం కొండలు పగలగొట్టారు. నక్కలు, ఎలుగుబంట్లు పారిపోయాయి. జనం నీళ్లకోసం విస్తారంగా బావులు తవ్వారు. ఒక బావి నిజానికి కొన్ని కుటుంబాలకు సరిపోతుంది. అటువంటిది - ఎవరికి వారే బావులు తవ్వారు. ఒకోసారి నీరు పడేదికాదు. డ్రిల్లింగు మిషన్లతో చాలా లోతుకు వెళితే తప్ప నీరు దొరికేది కాదు. చివరికి అలా వెళ్లినా నీరు పడని పరిస్థితి కూడా అక్కడక్కడ వచ్చింది.

జంతుచర్మాలు ఎగుమతిచేస్తే ఇబ్బడి ముబ్బడిగా లాభాలుగడించవచ్చని వేటకాళ్లకి డబ్బులిచ్చి జంతువుల్ని చంపించాడు హిరణ్యాకుడు. పులిచర్మం, లేడిచర్మం, దుప్పిచర్మం - ఒకటేమిటి - దేశ దేశాలకు ఎగుమతి చేశాడు. వాటి మాంసం పనికొచ్చినవాడికి - అమ్మేవాడు. కుందేళ్లు, నెమళ్లు, పావురాళ్లు, కొంగలు, అడవి కోళ్లు.... ఒకటొకటీ చచ్చిపోతున్నాయి. రైళ్లు వచ్చాయి, బస్సులొచ్చాయి. ఎటువంటి ఎటువంటి అడవులూ రూపుమాసిపోయాయి. సముద్రాలమీదికి చాలా దూరం వెళ్లి చేపలు పట్టే ఓడలొచ్చాయి. నడిసముద్రంలో చేపలకి కూడా భద్రత లేకుండా పోయింది. జీవితమే వ్యాపారంగా ధనార్జనగా మారిపోయింది.

రాజ్యాల మధ్య యుద్ధాలొచ్చాయి. సముద్రాల్లో అణుప్రయోగాలు చేశారు. తీరప్రాంతప్రజలు లక్షల సంఖ్యలో చచ్చిపోయారు. చేపలు కోట్ల సంఖ్యలో చచ్చిపోయాయి. మొసళ్లు, తిమింగాలాల్లాంటి పెద్దజంతువులక్కూడా ప్రాణభయం తప్పలేదు. యుద్ధసమయాల్లో పల్లెలూ, పట్టణాలూ భస్మీపటం కావడంతో సరిపోలేదు. ఆకాశంలో రాబందులు, గద్దలు చచ్చిపోయాయి. పక్షులక్కూడా స్వేచ్ఛగా ఎగరడానికి భయంగా వుంది. నూనె కోసం, బొగ్గు కోసం, ఖనిజాలకోసం గనులు తవ్వారు. భూమి మొత్తం వణికిపోతున్నది - స్వార్ధపరుల ధనదాహానికి - నాగరికత దాడికి.

★ ★ ★

ధనవర్షుడికి నీరసం వచ్చింది. వంటినిండా చెమట. కాళ్లు నొప్పిగా వున్నాయి. సూర్యుడు ధనవర్షుడి నెత్తిమీద ఉన్నాడు. దాహం వేసింది. కళ్లు తిరుగుతున్నాయి. నోరు పేడచకట్టుకు పోతున్నది. దాహం తీరే మార్గం కనపడలేదు. తనవంటిమీద చమట చేత్తో తీసుకుని నాకాడు. అతనికి తన జీవితమేకాదు - మొత్తంగా మానవజీవితం అంతా గుర్తొచ్చింది. పక్షుల కూతలు ఎంత బాగునేవి. సీతాకోక చిలుకలు ఎగురుతుంటే ఎంతకన్నుల పండువుగా వుండేది. చెట్ల నీడ ఎంత చల్లగా వుండేది.. ఇప్పుడంతా శూన్యం... ప్రకృతి పగబట్టింది.. నడుస్తున్నాడు... నడుస్తున్నాడు...

నీరు కనపడింది. సెలయేరా? చెరువా? తెలీదు. ఆశగా నడిచాడు. నీళ్లు వెనక్కి వెనక్కి వెళ్లాయి. ఇంకా నడుస్తున్నాడు. అడుగులు తడబడుతున్నాయి. వంటి మీద చెమట అందిన కాడికి నాకాడు. నీళ్లు వెనక్కి వెళ్తున్నాయి. నీళ్ల నడుస్తాయా - వెనక్కినడుస్తాయా - అసలు నీళ్లున్నాయా... చెవుల్లోంచి వోరు బయల్దేరింది. కళ్లు తిరిగాయి. పడిపోయేముందు నీళ్లకి అవతలి ఒడ్డున - అసలు నీళ్లున్నాయా, తన భ్రాంతా - ఒక మనిషి కనిపించాడు. హిరణ్యాకుడు! ఇంకెందరు పడిపోయారో ఎటుపోయారో ఏమయ్యారో.. యాంత్రికుడూ చచ్చిపోయి వుంటాడు. ఎన్నెన్ని యంత్రాలు చేశాడు. అన్ని రకాల యంత్రాలూ చేశాడు. మారణాయుధాలు కూడా సృష్టించాడు. ప్రజల్ని లక్షల కోట్లమందిని చంపేయంత్రాలు తయారు చేశాడు. ఎక్కడో చచ్చిపోయివుంటాడు. తాను చేసిన పనికి తానే బలయిపోయివుంటాడు. సామాన్యంగా సహజంగా చచ్చివుండడు. భయంకర మరణయాతన అనుభవించి వుంటాడు. చక్రవర్తి చచ్చేవుంటాడు. ఎన్నటికీ తీరని భూదాహంతో, అధికారదాహంతో ఎన్నెన్నిఘోరాలు చేశాడు! తప్పక చచ్చివుంటాడు -

ధనవర్షుడికి నోరు పిడచకట్టుకుపోయింది. చెవులు గింగురుమంటున్నాయి. చుట్టూచూశాడు. తనకళ్లు చూడగలుగుతున్నాయి. తనకింకా స్పృహవుంది. ఎవరో ఏదో మాట్లాడుతున్నారు. ఎవరు? చుట్టూ కలియజేశాడు. ఎవరున్నారు మాట్లాడటానికి ఒక్కపిట్టగాని చెట్టుగాని లేవుగదా - మరి -!?

భూమిలోంచి మాటలు వినిపిస్తున్నాయా? కాదు. తన భ్రమ, తనలోంచే తనకి మాటలు వినపడుతున్నాయా? ఏమీ తెలియటం లేదు.

ఆవులకి గేదెలకి పాలుపిండుకున్నాడు. ఆహారం కోసం మొదట్లో ఆవుల్నే తిన్నాడు. అది ప్రాచీనకాలం.. ఇప్పుడు కోళ్లని మేకల్ని గొఱ్ఱెల్ని చంపాడు. తనకి అక్కర్లేని వన్నీ చంపాడు. అవన్నీ ఇప్పుడు మానవజాతిమీద పగబట్టాయా? ఆఖరికి రాళ్లూ నీళ్లూ కూడా పగబట్టాయా?

నేలమీద పడివున్నాడు ధనవర్షుడు, చెవిలో ఏదో పురుగుదూరింది. చేత్తో కొడదామనుకున్నాడు చేతులు రాలేదు. తల విదిలించుకుందామనుకున్నాడు. తలకూడా కదిలేట్టులేదు. ఓర్చుకోలేకపోతున్నాడు. పురుగు దొలుస్తున్నదా? ఇంకో పురుగు పొట్టకింద చేరి కిరకిరలాడుతుంది. దొలుస్తుందేమో చాలా బాధగా వుంది. తలతిప్పడం కూడా వీలుకావడం లేదు. వంటిమీద చమట కూడా లేదు. తను క్రమంగా చచ్చిపోతున్నాడా. అల్లంత దూరంలో ఎదురుగా హిరణ్యాకుడి మీద ఏదో డేగవాలినట్టుంది.. డేగ అతనికళ్లు పొడిచింది. కడుపులో పేగులు లాగుతోంది. పెనుగులాడుతున్నాడు. ఆర్తనాదం చేస్తున్నాడు. కదల్లేకపోతున్నాడు. ఆ పక్కనుంచి పులివచ్చింది. పులి అతని తలకొరుకుతోంది. అంతా

తెలుస్తూనే వుంది. స్పృహతప్పలేదు. ప్రపంచం అంతా శూన్యం కదా - డేగా పులీ ఎలా వచ్చాయి? మళ్లీ కళ్లు చిట్లించి చూశాడు. అంతా వట్టిది. తన భయం. తన భ్రమ లేక నిజమేనా? ఏం తెలియడం లేదు.

ఏదో తన వంటిమీద పాకుతోంది. పామా? చుట్టూ ఎన్నెన్ని పక్షులు వాలాయో ఎన్నెన్ని పురుగులో - తుట్టలు తుట్టలు... పక్షులు పురుగుల్ని తినడం లేదు. తనని పొడుస్తున్నాయి. అబ్బా - భరించలేడు. ఆ బాధ భరించలేడు - తనేమీ చెయ్యలేడు. పురుగులు వంటినిండా పాకుతూ తన చర్మం కొంచెం కొంచెం కొరుక్కుతింటున్నాయి. బాధ... బాధ.... కళ్లు పైకెత్తి చూశాడు.

ఆకాశం నిండా నల్లని మేఘాలు కమ్ముకున్నాయి. కారునల్లని మేఘాలు. పట్టపగలే చీకటి వ్యాపిస్తున్నది. సూర్యుడు మబ్బులచాటున మాయమయ్యాడు. మబ్బులు కదుల్తున్నాయి. పిడుగు అమ్మో - చెవులు చిల్లులుపడేలా పిడుగు పడింది. ఆకాశం బీటలు తీసినట్టు మెరుపు మెరిసింది. మళ్లీ పిడుగు. భూనభోంతరాళాలు దద్దరిల్లిపోయాయి. భూమి కూడా పగిలిందా? మేఘాలు కళ్లెర్ర జేస్తున్నట్టు మెరుపులు. ఆకాశం కొరడాలు ఝుళిపిస్తున్నట్టు మెరుపులు.

చుట్టూ పెళపెళమనిచప్పుడు. భూమి పెనుమొసలిలా నోరుతెరిచింది. ధనవర్షుడు క్రమంగా ఆ కలుగులోకి జారిపోయాడు.

ధనమే సర్వం అనుకున్నాడు. సర్వాన్నీ ధనంగా మార్చాడు. ధనంతో ధనంకూడబెట్టాడు. ప్రకృతి మొత్తాన్ని అమ్మకపు సరుకుగా మార్చాడు. తల్లిలా సమస్తమూ ఇచ్చి, శ్రమనేర్పి, జంతువుల్నించి వేరు చేసి మనుషుల్ని చేసి పోషించిన తల్లిని, ప్రకృతిని హింసించాడు. ఏ జంతువులూ తమంత తాము శ్రమ చెయ్యవు. ఆహారాన్ని ప్రకృతి నుంచే సేకరించుకొని తింటాయి. చెరువుల్లోంచి నదుల్లోంచినీరు తాగుతాయి. చెట్లకింద, గుహల్లో విశ్రమిస్తాయి. వాటికి శ్రమ తెలియదు. అవి పనిచెయ్యవు. వస్తువుల్ని, సరుకుల్ని తయారు చెయ్యవు. ఉత్పత్తి తెలియదు. శ్రమ, ఉత్పత్తి సంబంధాలు లేనప్పుడు మాట్లాడే అవసరం వుండదు. కొద్దిపాటి ధ్వనులు సరిపోతాయి. కనుక జంతువులకి భాష అవసరం లేదు. అరుపులు చాలు. మొదట్లో తానూ అరిచేవాడు. క్రమంగా మానవుడు మాటలు నేర్చుకున్నాడు. శారీరకంగా జంతువుల్నించి వేరయ్యాడు. శ్రమ చేశాడు. సంఘజీవి అయ్యాడు. అలా ఎన్ని వేల సంవత్సరాలో... ప్రకృతి నేర్పిన శ్రమతో ప్రకృతి సిద్ధమైన అన్నిటినీ వస్తువులుగా మార్చాడు. అలా కొన్ని వేలసంవత్సరాలు. వస్తువులు సరుకులయ్యాయి. ప్రకృతి సమస్త సుఖాల్నీ ఇచ్చింది. మొదట్లో ప్రకృతి ఏమీనష్టపోలేదు. సరుకులు మారకం అయ్యాయి. ధనం ఏర్పడింది. వ్యాపారం ప్రారంభమయ్యింది. సరుకులు ధనంగా మారాయి. ధనం పెట్టుబడిగా మారింది. పెట్టుబడి మనిషిని స్వార్ధపరుణ్ణి చేసింది. మనిషి సర్వనాశనమయ్యాడు. క్రమంగా స్వార్ధం పెరిగి ప్రకృతిని హింసించాడు. జీవరాశి మానవుడి చేతిలో గత కొన్ని వందలయేళ్లుగా హింసననుభవించింది. నదుల్ని పర్వతాల్ని, ఆకాశాన్నీ కూడా హింసించాడు మానవుడు.

ధనవర్షుడికింకా తెలివితప్పలేదు. సగం శరీరం పైనే వుంది. సగం శరీరం భూమిలో వుంది. ఇంకా మెదడు ఆలోచిస్తోంది. అతని మెదడులో విద్యుత్తు ప్రవహిస్తున్నట్టుయింది. అన్నీ తెలుస్తున్నట్టయింది. కళ్లు తిప్పి అటుయిటూ చూశాడు - మెదడులో ఆలోచనలు పురుగుల్లా పరుగులు తీస్తున్నాయి.

కృత్రిమ ఉపగ్రహాలు, శాటిలైట్లు, కంప్యూటర్లు, రాడార్లు, నూతన అన్వేషణలు తప్పుకాదు. వాటిని ఉపయోగించే తీరు మాత్రం తప్పు... ఇదంతా మానవులు చేసింది కాదు - మానవులలో ఒక వర్గం పాలకవర్గం వర్గం - తీరనిదాహంలాంటి స్వంత ఆస్తిభావం - మొత్తం మానవజాతిలో కొద్దిశాతం.. వాళ్లే అన్నీ చేశారు. సామాన్య శ్రమజీవులు దోపిడీకి గురయ్యారు. సామాన్య ప్రజలు అన్యాయమైపోయారు.

ధనవర్ధుడుకి అంతా కళ్లముందు కదిలింది. శరీరం కొంచెం కొంచెం భూమిలోకి కుంగింది. తల మిగిలింది. కొంచెం మెడ మిగిలింది. మిగిలినతలలో మెదడుంది. మెదడు! పదార్థం యొక్క ఉచ్ఛతమరూపం! మానవుడి మెదడుకంటె అభివృద్ధి చెందిన పదార్థం ప్రకృతిలోనే లేదు. ఆ మెదడుతోనే మానవుడు మహోన్నత కార్యాలు చేశాడు. ఆ మెదడుతోనే మానవుడు పరమనీచమైన, క్రూరమైన అమానుషమైన పనులు చేశాడు. వికృతమైన పనులు చేశాడు. విధ్వంసం. ధ్వంసరచన చేశాడు.

పిడిగు - మళ్లీ పిడుగు - మళ్లీ పిడుగు - చెవులు.. కాదు తలపగిలేంత శబ్దం - కళ్లు కాలిపోయేంత వెలుగు - వెలుగు శబ్దం వెలుగు వెలుగు వెలుగు శబ్దం శబ్దం.. భరించలేడు - భరించలేడు ధనవర్ధుడి కళ్లు మూతలు పడుతున్నాయి. ఏం తెలియటం లేదు - తెలుస్తుంది - తెలియటం లేదు - వ్యక్తా వ్యక్త పరిస్థితి - తలని పురుగులు ఆక్రమించాయి. విమానాలమీంచి మందులు జల్లి మరీ చంపినపురుగులు... క్రిమికీటకాలు సూక్ష్మజీవులు అతని తలని ఆక్రమించాయి. కళ్లుతినేశాయి. పిడుగు.. మెరుపు... మెరుపు పిడుగు - తల ఫెటిల్లున పగిలింది - ఆఖరికి తల పగిలింది - మెదడుకు పురుగులు పట్టాయి. అలా ఎన్ని రోజులో - ఈ భూమి మీద చివరి మానవుడి చివరి శరీర భాగం మట్టిలో కలిసిపోయింది. ప్రకృతిలో కలిసిపోయింది. పురుగులే మనిషిని మట్టిలోకలిపాయి - భూమి తనలో తాను తిరుగుతూ సూర్యుడిచుట్టూ తిరుగుతుంది - అనంత కాంతిపుంజంలా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు - అలా ఎన్ని సంవత్సరాలో - ఎన్నియుగాలో -

ఆకాశంలో చిన్నచిన్న మబ్బులు పట్టాయి. సర్వాహ్లాదకరంగా గాలివీచింది. నేలమీద ఒక చినుకుపడింది. నేల సంతోషంతో తుళ్లిపడింది. మరో చినుకు. పులకించింది. మరో చినుకు. నేల తడిసింది. నేల ఉల్లం ఉప్పొంగి పరిమళించింది పరవశించింది కొత్తవాన - సరికొత్తవాన... ఒక ముగింపు తరవాత ఒక ప్రారంభం.. జీవధార ప్రాణధార - ఎక్కడ దాక్కున్నదో పచ్చదనం - నేలనేలంతా ఆకుపచ్చరంగు పులిమినట్టయింది. మళ్లీ ప్రాణం వికసించింది...

*Rachel Carson అనే అమెరికన్ మహిళా శాస్త్రవేత రచించిన The Silent Spring రెండోసారి చదివి -*

*- రచనా కాలం : 11,12-1-2001. సాహితీ స్రవంతి, ఉత్తరాంధ్ర కథల పోటీ (2002) లో ప్రథమ బహుమతి పొందినది.*